
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 22.789 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,448 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,030
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,490
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,655
నవర (8 గ్రా) - రూ.45,240

గరిష్టం/కనిష్టం
35.9 /26.6

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 59 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గణనాథుడి ఆశీస్సులు మెండుగా ఉండాలి



నెల్లూరు(దర్గామిట్ట): ప్రజలందరూ వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గణనాథుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రజలందరూ ఆనందంగా జీవించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఎంపీ వేమిరెడ్డి శుభాకాంక్షలు



వినాయకచవితి సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి దివ్యకృప ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. చవితి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

కలెక్టర్, జేసీ శుభాకాంక్షలు



గణేశుడి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, వినాయకచవితి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆకాంక్షించారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని కలెక్టర్, జేసీ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

నేటి స్పందన రద్దు

నెల్లూరు(దర్గామిట్ట): వినాయకచవితి పండగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో నెల్లూరు కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం జరగదని డీఆర్వో వెంకటనారాయణమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న కలెక్టరేట్‌లో యథావిధిగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం కొనసాగుతుందని, 20వ తేదీ ఇందుకూరుపేట, 22న చేజర్ల మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని డీఆర్వో తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

నెల్లూరు(క్రైమ్): స్థానిక ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని వినాయకచవితి సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించింది.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన వేదఅక్షయ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని రంగనాయకులపేటలో ఉన్న సోమిశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం కెనిషిటోర్యూ నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్ కేటగిరిలో నెల్లూరు స్మాలర్ స్కాలర్స్ స్కూల్ విద్యార్థిని వేద అక్షయ ద్వితీయస్థానంలో నిలిచి వెండిపతకం సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ పద్మజ తదితరులు వేద అక్షయను అభినందించారు.

స్త్రీనిధితో ఆర్థిక ప్రగతి

మహిళల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు వందల కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తోంది. ఆ రుణాలతో చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థిక ప్రగతి సాధిస్తున్న మహిళలు వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. తమను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

- అక్కచెల్లెమ్మలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.142 కోట్ల రుణాలు
- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న స్వయం సహాయక గ్రూపు మహిళలు
- గ్రూపులో సభ్యులందరికీ 48 గంటల్లో లోన్లు

నెల్లూరు(పొగతోట): మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్న నేపథ్యంలో స్వయం సహాయక గ్రూపుల మహిళల(ఎస్‌హెచ్‌జీ)కు ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. స్వయం సహాయక గ్రూపు మహిళలు స్త్రీనిధి రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక గ్రూపుల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అవసరమైన పెట్టుబడి కోసం ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా జీవనోపాధి రుణాలు మంజూరు చేస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 27,401 మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలకు రూ.142 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 6,528 మంది మహిళలకు రూ.33.72 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్త్రీనిధి రుణాల కేటాయింపు తక్కువగా ఉండేది. గ్రూపుల్లో ముగ్గురు మహిళలకు మాత్రమే రుణాలు మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్వయం సహాయక గ్రూపుల మహిళలకు వందల కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను మంజూరు చేసింది. అంతేకాకుండా స్వయం సహాయక గ్రూపులో ఉన్న సభ్యులందరికీ రుణాలు మంజూరు చేస్తోంది.



స్త్రీనిధి చెక్కు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి (ఫైల్)

సంవత్సరాల వారీగా స్త్రీనిధి రుణాల కేటాయింపు

	లక్ష్యం		మంజూరు	
సంవత్సరం	సభ్యులు	నగదు (రూ.కోట్లలో)	సభ్యులు	నగదు (రూ.కోట్లలో)
2019-20	22,000	110.00	22,178	111.26
2020-21	27,800	139.00	16,500	85.00
2021-22	34,717	173.57	45,008	152.01
2022-23	35,924	179.62	33,175	113.18
2023-24 (ఇప్పటి వరకు)	27,401	142	6.528	33.72

కోరిన వెంటనే రుణం మంజూరు

- స్వయం సహాయక గ్రూపుల సభ్యులు కోరిన 48 గంటల్లో స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు.
- సభ్యురాలు స్త్రీనిధి రుణం కోసం ఎక్కడికీ వెళ్లకుండా. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నారు.
- 0.93 పైసల వడ్డీతో రుణాలు అందిస్తున్నారు.
- ఎలాంటి ప్రాసెస్సింగ్ చార్జీలు. ట్యాక్స్ ఇతర రుసుములు లేవు.
- సులభతరంగా తిరిగి రుణాల చెల్లింపు.
- ఎటువంటి సిఫార్సు అవసరం లేదు
- సంఘంలో ఉన్న సభ్యులందరూ స్త్రీనిధి రుణాలు పొందే అవకాశం.

గతంలో..	ప్రస్తుతం
1. 10 మంది సభ్యులు ఉన్న సంఘంలో ఇద్దరు సభ్యులకు మాత్రమే రుణాలు మంజూరు చేసేవారు.	1. గ్రూపులో ఉన్న 10 మంది సభ్యులకు రుణాలు మంజూరు చేస్తున్నారు.
2. 11 మంది కంటే ఎక్కువ సభ్యులు ఉన్న సంఘంలో నలుగురికి రుణం తీసుకునే అవకాశం.	2. గ్రూపులో ఎంతమంది సభ్యులు ఉంటే అంత మంది మహిళలకు స్త్రీనిధి రుణాల మంజూరు
3. బ్యాంక్ లింకేజీ రుణంతో కలిపి రూ.లక్ష వరకు మాత్రమే రుణం తీసుకోవచ్చు. వడ్డీ 12.5 శాతం.	3. బ్యాంక్ లింకేజీ రుణంతో సంబంధం లేకుండా రూ.లక్ష వరకు రుణం తీసుకునే అవకాశం. వడ్డీ 0.93 పైసలు
4. వీఓ రుణ పరిమితి లేదు.	4. వీఓ రుణ పరిమితి ఉంది.
5. ఎ–గ్రేడ్‌లో ఉన్న గ్రామ సమాఖ్యకు రూ.25 లక్షలు, బి–గ్రేడ్ గ్రామ సమాఖ్యకు రూ 20 లక్షలు, సి–గ్రేడ్ గ్రామ సమాఖ్యకు రూ 15 లక్షలు.	5. ఏ గ్రేడ్ గ్రామ సమాఖ్యకు రూ 50 లక్షలు, బి గ్రేడ్ సమాఖ్యకు రూ 40 లక్షలు, సి గ్రేడ్ సమాఖ్యకు రూ 30 లక్షలు.

అక్క చెల్లెమ్మలకు అండగా..

జిల్లావ్యాప్తంగా 39,289 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో 4,09,523 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. స్వయం సహాయక గ్రూపులకు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేస్తున్నారు. అంతేకాక ప్రభుత్వం స్త్రీనిధి–జీవనోపాధి రుణాలు మంజూరు చేస్తూ అక్క చెల్లెమ్మలకు అండగా నిలుస్తోంది. బీమాతో కూడిన స్త్రీనిధి రుణాలు అందిస్తోంది. ఒక్కొక్క మహిళ లక్ష రూపాయలు స్త్రీనిధి నుంచి జీవనోపాధి రుణం పొందే అవకాశం ఉంది. తీసుకున్న రుణాలను తిరిగి సక్రమంగా చెల్లించిన గ్రూపులకు ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తోంది. జిల్లావ్యాప్తంగా వేలాది మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలు జీవనోపాధి రుణాలు తీసుకుని సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. అంతేకాక పిల్లల వివాహాలు, చదువులు, ఇతర అవసరాలకు స్త్రీనిధి రుణాలు దోహదపడుతున్నాయి.

రుణాల చెల్లింపునకు నూతన విధానం

స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు తిరిగి చెల్లింపుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నూతన విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. సభ్యురాలు సొంత బ్యాంక్ ఖాతా, భర్త, పిల్లల బ్యాంక్ ఖాతాల నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా రుణం చెల్లించే అవకాశాన్ని కల్పించారు. డెబిట్ కార్డు ద్వారా కూడా రుణాలు చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



స్త్రీనిధి ద్వారా మొదట రూ.50 వేలు రుణం తీసుకున్నాను. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించగా రెండోసారి రూ.లక్ష రుణం మంజూరు చేశారు. తీసుకున్న రుణాన్ని తిరిగి సక్రమంగా చెల్లిస్తున్నాను. చిన్న షాపు ఏర్పాటు చేసుకుని కుటుంబానికి అండగా నిలుస్తున్నా. చాలా సంతోషంగా ఉంది. సొంతంగా వ్యాపారం ప్రారంభించేలా ప్రోత్సహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– సుజాత, అల్లూరు

జీవనోపాధి మెరుగు



ఇబ్బందుల్లో ఉన్న సమయంలో స్త్రీనిధి రుణాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయి. స్త్రీనిధి రుణంతో ప్రావిజన్ షాపు ఏర్పాటు చేసుకున్నాను. జీవనోపాధి మెరుగుపడేలా ముందుకుసాగుతున్నా. రుణాలు సకాలంలో మంజూరు చేస్తున్న ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు.

– ఎస్.కవిత, మాచవరం, కందుకూరు

సిఫార్సులు అవసరం లేదు



స్వయం సహాయక గ్రూపు మహిళలకు కోరిన వెంటనే 48 గంటల్లో స్త్రీనిధి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రుణాల మంజూరుకు ఎలాంటి సిఫార్సులు, నగదు ఇవ్వాల్సిన అవసరం లేదు. మహిళలకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కామాక్షయ్య, స్త్రీనిధి ఏజీఎం

రూ.142 కోట్ల స్త్రీనిధి రుణాలు



ఈ ఆర్థిక సంవత్సరంలో 27,401 మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలకు రూ.142 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 6,528 మందికి రూ.33.72 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేశాం. మహిళలుఆర్థిక ప్రగతి సాధించేలా చర్యలు చేపడుతున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

నరుకూరు–తోటపల్లిగూడూరు రహదారికి మహర్దశ



పేడూరు సమీపంలో గుంతలమయంగా ఉన్న నరుకూరు–తోటపల్లిగూడూరు రహదారి

నరుకూరు–తోటపల్లిగూడూరు మార్గంలో ప్రయాణం సాగించే ప్రయాణికులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ రహదారి ఆధునీకీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.75 కోట్ల నిధులు కేటాయించింది. తద్వారా ఈ రోడ్డు ఆధునికీకరణ పనులు జరిగి ప్రయాణికుల రాకపోకలకు మార్గం సుగమం కానుంది.

- రూ.3.75 కోట్లతో ఆధునికీకరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

తోటపల్లిగూడూరు: నరుకూరు–తోటపల్లిగూడూరు ఆర్‌అండ్‌బీ రహదారి 7 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. నరుకూరు నుంచి పేడూరు మీదుగా తోటపల్లిగూడూరు మండల కేంద్రం, జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కాటేపల్లి శివాలయం, కాటేపల్లి బీచ్, సెంబ్‌కార్ప్ పవర్ ప్లాంట్‌లకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారి పేడూరు నుంచి తోటపల్లిగూడూరు వరకు గత కొన్నేళ్లుగా అస్తవ్యస్తంగా ఉండేది. ముఖ్యంగా పేడూరు సమీపంలో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలం వచ్చేందంటే ఈ మార్గంలో ప్రయాణం మరింత అసౌకర్యంగా ఉండేది. గంతలమయమైన ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతుండేవి.

నిధుల మంజూరుకు కృషి

రాష్ట్రంలోని రహదారుల రూపురేఖలను మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలోని రహదారుల ఆధునికీకరణపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే నరుకూరు–తోటపల్లిగూడూరు రోడ్డును ఆధునికీకరించేందుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాకు మంజూరైన 5 రహదారుల ఆధునికీకరణ పనుల్లో నరుకూరు–తోటపల్లిగూడూరు రహదారి ఒకటి.

ఆధునికీకరణ పనులు ఇలా..

నరుకూరు–తోటపల్లిగూడూరు డబుల్ రోడ్డు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.3.75 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిధులతో పేడూరు నుంచి తోటపల్లిగూడూరు వరకు 5.5 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులను చేపట్టనున్నారు. ఇందులో పేడూరు గ్రామం మధ్యలో 680 మీటర్ల మేర సీసీ రోడ్డును నిర్మిస్తారు. అలాగే మండల కేంద్రం సమీపంలోని పాపిరెడ్డిపాళెం డొంక రోడ్డు నుంచి ఇస్కపాళెం గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ వరకు 700 మీటర్ల మేర సీసీ రోడ్డును నిర్మించనున్నారు. మిగిలిన రహదారి మొత్తం బీటీ రోడ్డుతో తీర్చిదిద్దనున్నారు. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



నరుకూరు–తోటపల్లిగూడూరు డబుల్ రోడ్డు గుంతలమయంగా ఉండేది. ఈ రోడ్డు ఆధునికీకరణ పనుల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నరుకూరు–తోటపల్లిగూడూరు రోడ్డు ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

– పాకం ప్రవీణ్‌కుమార్, టీపీ గూడూరు

వారంలో టెండర్లు నిర్వహిస్తాం

నరుకూరు–తోటపల్లిగూడూరు రోడ్డు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.3.75 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పేడూరు నుంచి తోటపల్లిగూడూరు వరకు 5.5 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులు చేపట్టడం జరుగుతుంది. ఈ పనులకు సంబంధించి వారంలో టెండర్లు నిర్వహిస్తాం. వీలైనంత తొందరగా పనులను ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నరేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, టీపీ గూడూరు

ఉత్సాహంగా జిల్లాస్థాయి యోగా పోటీలు



యోగా పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా యోగ క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు బట్వాడిపాళెం ప్రశాంతినగర్‌లోని నిర్మలసౌధలో ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారు అక్టోబర్ 14, 15 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు ఎన్వీ రమణారెడ్డి, ప్రసన్నకుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విశ్వకర్మ జయంతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి కాకాణి పూజలు



విశ్వకర్మ భగవానుడి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ పురాణాల ప్రకారం విశ్వకర్మ భగవానుడు స్వయంభువుగా, సృష్టికర్తగా పరిగణించబడ్డారని తెలిపారు. కృష్ణుడికి ద్వారక నగరాన్ని, దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను సృష్టించి ఇచ్చిన దేవశిల్పి విశ్వకర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జిల్లా యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు నారాయణబాబు, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఎంబెటి ఏసునాయుడు, కార్పొరేటర్లు మూలే విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

స్కాడాతో విద్యుత్ సమస్యలకు చెక్

- నెల్లూరు నగరంలో స్కాడా పరిధిలోకి 13 సబ్‌స్టేషన్లు
- రూ.20 కోట్లతో స్కాడా వ్యవస్థ ఏర్పాటు

విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్య తలెత్తిందో గుర్తించడంతోపాటు పునరుద్ధరణ చర్యల్లో ఆలస్యాన్ని తగ్గించేలా ఏపీఎస్పీడీసీఎల్ స్కాడాను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సిస్టమ్ ద్వారా విద్యుత్ సరఫరాలో ఏ ప్రాంతంలో అంతరాయం కలిగిందో వెంటనే గుర్తించి సత్వరమే మరో ఫీడర్ ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవచ్చు. ఏపీఎస్పీడీసీఎల్ ఈ విధానాన్ని నెల్లూరు నగరంలో అందుబాటులోకి తీసుకువచ్చి నిరంతరాయంగా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తోంది.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు నగరంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లను సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ అక్విజిషన్ సిస్టమ్(స్కాడా) పరిధిలోకి తీసుకురావడంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పడే విద్యుత్ సరఫరా అంతరాయాలను గణనీయంగా తగ్గించింది. నగరంలో మొత్తం 24 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా ఇప్పటికే 13 విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆ శాఖ అధికారులు స్కాడా పరిధిలోకి తీసుకువచ్చారు. మిగిలిన సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

స్కాడా పనిచేసే విధానం

నెల్లూరు నగరంలోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్ ఆవరణలో ప్రత్యేకంగా స్కాడా భవనాన్ని నిర్మించారు. ఈ స్కాడా సిస్టమ్ పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్లకు సంబంధించిన విద్యుత్ ఫీడర్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ సరఫరాను సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. స్కాడా పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్లకు ఒక ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలిగిన తక్షణమే మరో ఫీడర్ ద్వారా ఆటోమేటిక్‌గా విద్యుత్‌ను అందించే సౌకర్యం ఉంటుంది. స్కాడా కార్యాలయంలో సిబ్బంది నిరంతరం విద్యుత్ సరఫరా తీరును పెద్ద స్క్రీన్లపై పర్యవేక్షిస్తూ అంతరాయాలు ఏర్పడే విద్యుత్ ఫీడర్లను గుర్తిస్తుంటారు. సిబ్బంది ఏ ఫీడర్లలో సమస్య తలెత్తిందో గుర్తించడంతోపాటు వెంటనే మరో ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు. తద్వారా కొన్ని నిమిషాల వ్యవధిలోనే సమస్య పరిష్కారమవుతుంది. క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది సమస్య వచ్చిన ప్రాంతానికి తక్కువ వ్యవధిలో వెళ్లి విద్యుత్ లైన్లు, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. ఓల్టేజీ సమస్య ఉన్నా, విద్యుత్ లైన్లు తెగిపోయినా, ఫీడర్లు మరమ్మతులకు గురైనా స్కాడా కార్యాలయం నుంచి పర్యవేక్షించే సిబ్బంది ఆ సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలిపి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. జిల్లాలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు ఏపీఎస్పీడీసీఎల్ రూ.20 కోట్లు ఖర్చు చేసింది.



స్కాడా భవనంలో పర్యవేక్షిస్తున్న సిబ్బంది

విద్యుత్ అంతరాయాలకు చెక్ పెట్టేందుకే..



నెల్లూరు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు చెక్ పెట్టేందుకు స్కాడా సిస్టమ్ ఎంతో దోహదపడుతోంది. ఇప్పటి వరకు నగరంలోని 13 విద్యుత్ సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకువచ్చాం. త్వరలో మిగిలిన అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– సోమశేఖర్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ ఈఈ

క్లుప్తంగా

సీఎమ్మార్‌లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బృందావనం): మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అన్న నినాదంతో చందన, సీఎమ్మార్, కంచికామాక్షి షోరూంలలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మట్టి వినాయకులను నిమజ్జనం చేస్తే పర్యావరణానికి ఎటువంటి హాని జరగదన్నారు. ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు చందన, సీఎమ్మార్ కృషి అభినందనీయమన్నారు. సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా తమ సంస్థ ద్వారా పది వేలకుపైగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు. తమ షాపుల్లో పర్యావరణానికి హాని కలిగించని వినాయక బొమ్మలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో 10 నుంచి 15 అడుగుల ఎత్తులో కొబ్బరికాయలు, పసుపు కొమ్ములు, ఎండుఖర్జూరం, ద్రాక్ష, రుద్రాక్ష తదితరాలతో ప్రతిమలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది వినాయకుడికి ఇష్టమైన గరికతో పది అడుగుల ప్రతిమను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, సీఎమ్మార్ మేనేజర్లు శ్రీనివాసులు, శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికి జనం కరువు

- సర్వేపల్లిలో వెలవెలబోతున్న నిరసన దీక్షలు



వెంకటాచలంలో రిలే దీక్షకు కొద్ది మంది మాత్రమే హాజరైన దృశ్యం

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఆయన ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు జనం నుంచి స్పందన కరువవుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కేసులో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం రిలే దీక్ష చేపట్టారు. అయితే దీక్షకు కొద్దిమంది మహిళలు, టీడీపీ నాయకులు మాత్రమే హాజరవడం చూసి సోమిరెడ్డి అవాక్కయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో అసహనానికి గురయ్యాడు. నామమాత్రంగా కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చేపట్టాల్సిన రిలే దీక్షలో సోమిరెడ్డి ఉన్న కాసేపు మినహాయిస్తే శిబిరం వద్ద పది మంది కూడా లేకపోవడం టీడీపీ దయనీయ పరిస్థితిని తెలియజేస్తోంది.



నెల్లూరులో వినాయకుడి ప్రతిమను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న భక్తులు



నెల్లూరులో విక్రయానికి సిద్ధం చేసిన మట్టి బొమ్మలు



పూల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లో కొనుగోలుదారుల రద్దీ

వినాయక చవితి సందడి

నెల్లూరు(బృందావనం): జిల్లా వ్యాప్తంగా ఆదివారం వినాయక చవితి సందడి నెలకొంది. వినాయక చవితిని ఏ రోజు జరుపుకోవాలోనన్న సందిగ్ధంలో ఉన్న భక్తులకు సోమవారం ఉదయం 10.15 గంటల నుంచి మంగళవారం ఉదయం 10.54 గంటల వరకు చవితి గడియలు ఉంటాయని వేదపండితులు ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా భక్తులు సోమవారమే వినాయక చవితిని జరుపుకోవాలని సంకల్పించారు. వినాయకుడి ప్రతిమలు, పూజాసామగ్రి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచి నెల్లూరులో కొనుగోలుదారుల సందడి నెలకొంది. నవాబుపేట, మైపాడుగేట్‌సెంటర్, మద్రాసు బస్టాండ్, ఏసీ కూరగాయల మార్కెట్, చిన్నబజారు, పెద్దబజారు, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, డైకస్‌రోడ్డుసెంటర్, పద్మావతిసెంటర్, వేదాయపాళెం, నిప్పోసెంటర్, తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో తీర్చిదిద్దిన భారీ వినాయకుడి విగ్రహాలను గణేశ ఉత్సవాల నిర్వాహకులు ప్రత్యేక వాహనాల్లో గణేశ మండపాలకు తరలించారు.



ట్రాక్టర్‌పైకి వినాయకుడి ప్రతిమను తరలిస్తూ..



పత్రి కొనుగోలు చేస్తూ..



గొడుగులు కొనుగోలు చేస్తున్న భక్తులు

ఎన్నికల వరకే బాబు, పవన్ డ్రామాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: మరో ఆరు నెలల్లో ఎన్నికలు ఉండడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి వచ్చి డ్రామాలు ఆడుతున్నారని, ఎన్నికలు ముగియగానే వారిద్దరూ హైదరాబాద్ వెళ్లిపోతారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం సిరిపురంలో ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎక్కడా కనిపించలేదన్నారు. కరోనా కాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా హైదరాబాద్‌లోని స్వగృహాల్లో ఉండిపోయారని గుర్తుచేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు రాష్ట్రానికి వచ్చి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విచిత్ర విన్యాసాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల పట్ల నిబద్ధత లేని స్వార్థపరులైన వారికి బుద్ధి చెప్పాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా దోపిడీ చేసిన గజదొంగ చంద్రబాబు, ఆయన వద్ద ప్యాకేజీలు తీసుకుని మద్దతు తెలిపే పవన్‌కల్యాణ్ మన రాష్ట్రానికి అవసరమా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి మాటల్లో కాదు చేతల్లో చూపుతున్నారని, ఎన్నికల హామీ మేరకు నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా అందజేయడమే కాకుండా ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందజేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేస్తూ ప్రజలను ఏమార్చారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు ప్రత్యక్షంగా ప్రజలకే చూపుతోందన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే చంద్రబాబు నిజస్వరూపం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, ఆయన తన ఉనికి కోసం నానా పాట్లు పడుతున్నాడన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి విద్యార్థి మృతి



అస్గర్‌అలీ మృతదేహం

చేజర్ల(సోమశిల): ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన అనంతసాగరంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..అనంతసాగరానికి చెందిన షేక్ కాలేషా కుమారుడు అస్గర్‌అలీ(10) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి సమీపంలోని ప్రాథమిక పాఠశాల వద్దకు ఆడుకునేందుకు వెళ్లాడు. అక్కడ మిద్దెపైకి ఎక్కి గాలిపటం ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆ సమయంలో బాలుడ్ని ఎవరూ గుర్తించకపోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం కుమారుడు ఎంతకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలించగా పాఠశాలలో విగతజీవిగా కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అర్క కంటి వైద్యశాల ప్రారంభం



అర్క కంటి వైద్యశాలను ప్రారంభిస్తున్న వైద్యులు

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని పొగతోటలో ప్రముఖ కంటి వైద్యనిపుణుడు గోపాలకృష్ణ సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్క కంటి వైద్యశాలను డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన కంటి వైద్యసేవలను అందించాలనే సంకల్పంతో డాక్టర్ గోపాలకృష్ణ తన సొంత భవనంలో అర్క కంటి వైద్యశాలను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. డాక్టర్లు శివప్రతాప్‌రెడ్డి, జేకేరెడ్డి పాల్గొన్నారు.

పూల ధరలకు రెక్కలు

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి పండగ సందర్భంగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. గణేశ్ మండపాలతో పాటు గృహాల్లోనూ వినాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేస్తుండడంతో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో వ్యాపారులు బంతి పూలు కిలో రూ.60 నుంచి రూ.100, చామంతి, గులాబీలు కిలో రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు.అలాగే కనకాంబరాలు కిలో రూ.500కు పైగా పలుకుతున్నాయి. దీంతో వినాయకుడి పూజకు పూలు కొనుగోలు చేసే భక్తులు బెంబేలెత్తుతున్నారు.

390 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో 390 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఒకటో యూనిట్లో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని చెప్పారు. సాంకేతిక కారణాలతో 2, 3వ యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోయిందని వెల్లడించారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



సుబ్బయ్య మృతదేహం

గుడ్లూరు: పురుగు మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుడ్లూరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాళ్లపాడుకు చెందిన మైదాల సుబ్బయ్య(75), వరమ్మ దంపతులు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. శనివారం సుబ్బయ్య కావలి రూరల్ మండలం కొత్తపల్లిలో ఉన్న చిన్నకుమార్తె వద్దకు వెళ్లి వస్తానని భార్య వరమ్మతో చెప్పగా, ఆమె ఇప్పుడు వద్దు..తర్వాత వెళ్లు అని గట్టిగా చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన సుబ్బయ్య గుడ్లూరు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. క్షణికావేశంలో గుడ్లూరులో పురుగు మందు డబ్బా కొనుగోలు చేశాడు. అనంతరం కొత్తపేటకు వెళ్లే రహదారిలో కాలువ పక్కన ఉన్న సమాధిపై కూర్చుని తాగి అక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి దగ్గరకు వెళ్లి చూడగా నోటి నుంచి నురగ వచ్చి అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలం వద్దకు చేరుకుని సుబ్బయ్యను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సుబ్బయ్య మృతదేహాన్ని రాళ్లపాడుకు చెందిన మెకానిక్ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సుబ్బయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 192

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629 [T-4590]

10th/Inter,BA, B.Com,B.Sc,BBA,BCA, BLIS,MA,M.Com,MSC,MCA,MBA,MLIS Dip,B.Tech,M.Tech,M.Phil,Ph.D.,BNYS, BPT (Discontinued), Cell: 9030030125. [T-2142]

REAL ESTATE

మీరు ప్లాట్, ఫ్లాట్, పొలం అమ్మదలచుకున్నారా / కొనదలచుకున్నారా. లీగల్ వెరిఫికేషన్‌తో లోన్ కలదు. వెంటనే అమ్మబడును/ కొనబడును. సంప్రదించండి. 90007 31560. [NA-11528]

SHOP FOR SALE

నెల్లూరు సిటీలో రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ అమ్మబడును లేదా పార్ట్‌నర్‌షిప్ ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్రదించగలరు. సెల్: 70826 10569. [NA-5886]

FLAT FOR SALE

నెల్లూరు బాలాజీనగర్ దగ్గర శ్రీనగర్‌లోని అపార్ట్‌మెంట్-5వ ఫ్లోర్ నందు 2BHK,1050 SFT East Facing Flatఅమ్మకమునకు కలదు. (No-Parking).సంప్రదించండి:9949284848. [NA-5884]

HOUSE FOR SALE

నెల్లూరు నుండి 8km దూరంలో మైపాడు రోడ్డుకు ఇండిపెండెంట్ 1BHK 29,90,000 రేటుకు, ఇండిపెండెంట్ 2BHK 34,90,000కు అమ్మబడును. సెల్: 63004 37419. [NA-22710]

LAND FOR SALE

ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2 km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. (With Farm House) వివరాలకు సంప్రదించండి. : 70362 31356. [NA-22709]

PLOT FOR SALE

Open Plot for Sale Mayuri Estate AP GENCO Ankanam 13000 AAA. Ph : 9866160867 [HA-5251]

నరుకూరు సెంటర్‌కు అతి సమీపంలో అంకణం 80వేలకే NUDA Approved ప్లాట్‌లు అమ్మబడును. బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 6281411178,9121452347. [NA-11523]

నవాబుపేట పత్తి వారి స్కూలు వద్ద 10 అంకణాల స్థలం అమ్మబడును.(తూర్పు ఫేస్). వివరములకు సంప్రదించండి: 9390777776. [NA-5237]

నుడా లేఅవుట్ వరగలి రోడ్డు & గూడూరు చెన్నై నేషనల్ హైవే వే, మెగా వెంచర్ పూర్తి డెవలప్‌మెంట్, బ్యాంకు లోన్స్ సౌకర్యం. ప్లాట్ కొన్న వారికి పట్టుచీర గిఫ్ట్. 99088 36056. [NA-22705]

TO-LET

నెల్లూరు హరనాథపురం 5వ లైను ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర 1st Floor, 2 Bed Room with 2 Wheeler పార్కింగ్‌తో బాడుగకు కలదు. సెల్: 94456 20572. [N-1189182]

SERVICES

SP: CPU, Printer, Projectors, AC, Fridge, LED TVs, Laptops. all electronic home appliances service @ your door step. Contact : 94419 55475. [N-755315]

ASTROLOGY

ఓంశక్తి ప్రశ్నమ్.. మీ ముఖం చూసి, మీ ఫోటో చూసి భవిష్యత్తు చెప్పబడును. మీ కీర్తి ప్రతిష్ట లకు భంగం వాటిల్లుట, అప్పులు చేయుట, తీర్చలేక పోవుట, విద్య, ఉద్యోగం, ప్రేమ, వ్యాపారం, భార్యాభర్తల మధ్య కోర్టు, కుటుంబ సమస్యలు ఏ విధమైన సమస్య ఉన్న చక్కటి పరిష్కారం చూపించబడును. గృహ శాంతి పూజలు, వ్యాపార అభివృద్ధికి, రాజకీయ అభివృద్ధికి యంత్రములు, తాయెత్తులు ఇవ్వబడును. వివరములకు ఓం నారాయణ స్వామి, రాజరాజేశ్వరి గుడి ఎదురుగా కరెంట్ ఆఫీస్ సెంటర్ వెనుక పోలీస్ కాలనీ నాలుగవ వీధి. నెల్లూరు. సెల్: 70974 44947. [NA-1635]

WANTED

Wanted Staff. College Bus Cum Car Drivers-4, Incharges-4, Telecallers(F)-4, Receptionist(F)-2, Cleaning-2. Contact: 63006 86382. [NA-10538]

Leela Interiors. We are Looking for Diploma and civil Engineers. AutoCAD Compulsory. Contact: 99496 14977. [NA-22708]

Obstetricians & Gynocologist, General Physician(MD), Radiologist(DMRD/MD), Duty Doctors. Qualified Nursing Staff, Lotus Hospital. Contact: 91212 82909. [N-1189191]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221620]

గూడూరులో చెముడి దగ్గర ఉన్న ఫ్యాక్టరీలో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 12గం॥ల డ్యూటీ, 14,000 జీతం, వీక్లీ ఆఫ్, ఫుడ్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 90141 08784. [N-1231805]

కూల్‌డ్రింక్స్ ఏజన్సీ నందు పర్మినెంట్‌గా పనిచేయుటకు డ్రైవింగ్ తెలిసిన సేల్స్‌మెన్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి: 62811 54902, 95333 02084. [N-1231804]

Digital E-Commerce ప్రమోట్ చేయుటకు Only Students, Marketing Teams కావలెను. ట్రే/వు. చిల్డ్రన్స్‌పార్క్ రోడ్, నెల్లూరు. సంప్రదించండి:7989552010,9502736577. [N-1231954]

బ్యాంక్‌లోన్స్ ప్రాసెస్ నందు **TeleCaller** కావలెను. Married Female టార్గెట్స్ లేవు. జీతం: 12,000/-.ట్రంక్‌రోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 88858 02000. [NA-22719]

DVR కంపెనీ నందు **M/F**, పార్టు/ఫుల్ టైం జాబ్స్ కలవు. (టెలికాలర్స్, టీం లీడర్స్, Pvt, Rtd ఎంప్లాయిస్, ఇతరులు) మార్కెటింగ్ చేయువారు కావలెను. సెల్: 99517 84612, 94948 49077. [NA-5232]

డిజిటల్ మార్కెటింగ్ ఏజన్సీ నందు పని చేయుటకు ఫోటోషాప్ డిజైనర్స్(M/F) PRO, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. పొగతోట, నెల్లూరు. సంప్ర: 91602 00300. [NA-10537]

మా రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & టీమ్ లీడర్స్ మండలాల వారిగా వెంటనే కావలెను. శాలరీ +కమీషన్+PF.సంప్రదించండి:9000731560. [NA-11529]

నెల్లూరులోని ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు అసోసియేట్ మేనేజర్స్ కావలెను. సైట్ ఇన్‌ఛార్జ్, లేడీ టెలి కాలర్స్ కావలెను. సంప్ర: 77020 23359. [NA-10936]

DTPఆపరేటర్స్: నెల్లూరులోని మా ఆఫీసులో పని చేయుటకు DTP ఆపరేటర్స్ కావలెను. అనుభవం బట్టి జీతం. రూ 12,000-30000. సంప్రదించండి.9502960270,9032055427. [NA-10935]

బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూం నెల్లూరు నందు పనిచేయుటకు ఆటో మొబైల్ లో 5సం॥ అనుభవం కలిగిన సేల్స్‌మేనేజర్ కావలెను.కరెంట్‌ఆఫీస్‌సెంటర్.83338 33567. [NA-1660]

The Mistuba Food Point నందు పని చేయుటకు Cashier కావలెను. వివరాలకు సంప్ర: 88015 48506, 91607 11786. [NA-5881]

నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని క్లాసిక్ మార్కెటింగ్ టైల్స్ & శానిటరీ వేర్‌లో సేల్స్‌బాయ్స్ / మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & గోడౌన్‌లో డెలివరీ Boys కావలెను. 63012 81399, 94912 71139. [NA-22706]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221708]

HERO స్పేర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీకి నెల్లూరులో పనిచేయడానికి 2 సం॥ Exp. గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. సంప్ర॥ ఇనమడుగు సెంటర్, నెల్లూరు. 91000 66736 [O-191653]

ప్రముఖ కేబుల్ సంస్థ నెల్లూరు, విజయవాడ, వైజాగ్ నందు ఫీల్డ్ వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను. Qul: 9th, 10th, ITI, ఇంటర్ Sal: 10,000/- to 15,000/- సెల్: 9494829197, 9347017891 [G-751646]

హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్. Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA-612]

1.నెల్లూరు సిటీలో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు 40సం॥ లోపు స్టాఫ్ అసిస్టెంట్స్ 10 మంది. అర్హత: ఏదైనా డిగ్రీ. లోకల్ వారికి ప్రాధాన్యత. 2. డ్రైవర్స్-2(ఇద్దరు) కావలెను. సంప్రదించండి: 94942 88807. [NA-22713]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.